# కేరళ వరదల్లో మృతుల కుటుంబాలకు సంతాపం- బాధితులకు సంఘీభావం

**ఆగస్టు** నెలలో కేరళలో కురిసిన భారీ వర్షాలు, ఆ రాష్ట్రాన్ని ముంచెత్తిన వరదలు, 535 చోట్ల కొండచరియలు విరిగిపడిన ఘటనలలో దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని సగంపైగా జిల్లాలు వరదనీటిలో మునిగాయి. పదిలక్షల మందికిపైగా ప్రజలు నిరాశ్రయులై, సహాయ శిబిరాలలో తలదాచుకున్నారు. వేలసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు; తాగునీరు, కనీస ఆహారం, పసిపిల్లలకు పాలు లభించక రోజుల తరబడి వరదల్లో చిక్కుకుని కొనప్రాణంతో బతికి బయటపడ్డారు. వేల కిలోమీటర్ల మేర రహదారులు, పలుప్రాంతాల్లో వంతెనలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డు, రైలు, విమాన సౌకర్యాలు స్థంభించిపోయాయి. వరద తీవ్రత తగ్గిన తర్వాత కూడా రవాణా సౌకర్యాలు పునరుద్ధరించబడక, నిత్యావసరాలు లభించక ప్రజలు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారు. విద్యుదుత్పత్తి కేంద్రాలు, సబ్‌స్టేషన్లు పూర్తిగా నీటమునగటం, విద్యుత్ వ్యవస్థ ఘోరంగా దెబ్బతినటంతో ఇప్పటికీ అనేక ప్రాంతాలు చీకటిలో మగ్గుతున్నాయి. సమాచార వ్యవస్థ పూర్తిగా దెబ్బతినటంతో, తమవారి ఆచూకీ అందక తల్లడిల్లిపోయారు. ప్రాధమిక సమాచారం ప్రకారం 20వేల కోట్ల రూ॥మేర ఆస్తినష్టం జరిగిందని అంచనా. పంటలు, పశువులు, ఆస్తుల నష్టం భారీస్థాయిలో జరిగింది. 2 లక్షలకు పైగా కోళ్ళఫారాలు పూర్తిగా నాశనమయ్యాయి. వరద తీవ్రత తగ్గి పది రోజులు గడుస్తున్నా ఇంకా లక్షలాదిమంది సహాయ శిబిరాల్లోనే వుండిపోవలసి రావటం వరద బీభత్సాన్ని తెలియజేస్తోంది. లక్షలాది ఇళ్ళు, నివాస స్థావరాలు వరదల్లో కొట్టుకుపోయాయి. వరద తాకిడికి తట్టుకొని నిలిచిన ఇళ్ళలో నాలుగు, ఐదు అడుగులమేర బురద మేటవేసి, నివాసయోగ్యం కాకుండాపోయాయి. యంత్రాల సాయంతో మాత్రమే బురద తొలగింపు సాధ్యమౌతోంది.

**కేరళ రాష్ట్రంలో సంభవించిన ఈ భారీ విపత్తులో మృతుల కుటుంబాలకు 'జనశక్తి' సంతాపం తెలియజేస్తోంది. వరద బాధితులకు సంఘీభావాన్ని ప్రకటిస్తోంది.**

వరద సహాయక కార్యక్రమాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ బలగాలు సహాయక చర్యలలో పాల్గొన్నాయి. వీరు రంగంలో దిగటానికంటే ముందుగా, స్వచ్ఛందంగా స్పందించి, తీరప్రాంత మత్స్యకారులు చేపలవేటకు వుపయోగించే తమ మోటారు పడవలన్నింటిని వినియోగించి, వరదలలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటంలో చేసిన కృషి ప్రశంసనీయం. మోటారు పడవల డీజిల్ వినియోగానికి ప్రభుత్వం అందిస్తామన్న ఆర్థిక సహాయాన్ని కూడా సున్నితంగా తిరస్కరించి, ఆపత్కాలంలో సహజంగా తాము స్పందించామంటూ శ్రామికవర్గ సంస్కృతిని, అపూర్వ మానవత్వాన్ని చాటిచెప్పారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత సహాయ, పునరావాస కార్యక్రమాల అమలులో కుల, మతాలకు అతీతంగా ప్రజలు సహకరించుకుంటున్నారు. మసీదులు, దేవాలయాలను శుభ్రపరుచుకోవటంలో పరస్పరం హిందువులు, క్రిస్టియన్లు, శిక్కులు తోడ్పాటునందించుకుంటున్నారు. దేశవ్యాపితంగా కేరళ వరదబాధితులకు ప్రజలు సంఘీభావంగా నిలిచారు. వివిధ సెక్షన్ల ప్రజానీకం నుండి వరద బాధితులకు ఆర్థికంగానూ, వస్తురూపంలోనూ సహాయం విస్తృతంగా చేరుతోంది.

ఆపత్కాలంలో ప్రజల స్పందన, సంఘీభావం ఇలా వుండగా, పాలకవర్గ పార్టీలు తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు వరదలను సైతం మినహాయించలేదు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి వయసుతో నిమిత్తం లేకుండా మహిళలందరికీ ప్రవేశం కల్పించాలని వామపక్ష ప్రభుత్వం నిర్ణయించటమే ఈ విపత్తుకు కారణమని; కేరళీయులలో అధికులు ఆవుమాంసం తినేవారు గనుక, వారిపై దేవుడు ఆగ్రహించాడని కొందరు హిందూమతతత్వవాదులు వ్యాఖ్యానించి, సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారంచేసి వారి విద్వేషాన్ని వెళ్ళగక్కారు.

గత వంద సం॥ల కాలంలో ఇంతటి వరద రాలేదని చెబుతున్నప్పటికీ, దాదాపు 1,64,280 చ॥కి॥మీ॥ పరిధిలో విస్తరించిన పడమటి కనుమల పరిధిలోని కేరళ, కర్నాటక, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణానికి హానికరంగా చేపట్టిన చర్యలు తీవ్ర చర్చనీయాంశంగా వున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లోనేగాక, పర్యావరణరీత్యా సున్నిత మండలాల(ఇఎస్‌జెడ్)లలో ఎక్కువ జనసాంద్రత కలిగి వుండటం, క్వారీలు, గనుల తవ్వకాలకు విచ్చలవిడి అనుమతులు, వరద హెచ్చరిక కేంద్రాల ఏర్పాటు-పర్యవేక్షణ, డ్యామ్‌ల నిర్వహణలలో లోపాలు మొదలైన అంశాలన్నింటినీ ప్రజాప్రయోజన దృష్టితో సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవటం ద్వారానే విపత్తులను సమర్థంగా ఎదుర్కోగలగటం, ప్రాణ, ఆస్థి నష్టాలను తగ్గించగలగటం సాధ్యమౌతుంది.

00000